బీఆర్‌ఎస్‌లో నయా జోష్



మీర్‌పేట: సభాస్థలికి ర్యాలీగా వస్తున్న మంత్రి సబిత, ఎంపీ రంజిత్‌రెడ్డి



యువతకు అభివాదం చేస్తున్న సబితారెడ్డి

- మీర్‌పేటలో యువగర్జన సభ
- భారీగా తరలిచ్చిన యువకులు
- బైకు, కార్ల ర్యాలీగా సభాస్థలికి చేరుకున్న మంత్రి
- మంత్రి సబితారెడ్డి గెలుపు ఖాయం.. ఎంపీ రంజిత్‌రెడ్డి

మీర్‌పేట: యువగర్జనతో బీఆర్‌ఎస్‌లో నయా జోష్ కనిపించింది. ఆదివారం సాయంత్రం నిర్వహించిన యువగర్జన సభకు నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డికి మద్దతుగా వేలాది మంది యువత కదం తొక్కారు. మీర్‌పేట పరిసర ప్రాంతమంతా జై సబితమ్మ... జై బీఆర్‌ఎస్.. జై కేసీఆర్ నినాదాలతో మార్మోగించారు. యువకుల భారీ బైకు, కార్ల ర్యాలీతో దారులన్నీ గులాబీమయం అయ్యాయి. భారీ ర్యాలీతో సభాస్థలికి చేరుకున్న మంత్రి సబితారెడ్డి యువతనుద్దేశించి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం యువత పక్షపాతి అని, రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ యూనివర్సిటీల నుంచి విద్యార్థి యువ నాయకులను ప్రోత్సహించి అసెంబ్లీకి, పార్లమెంటుకు పంపడంతో పాటు కార్పొరేషన్లు, కమిషన్‌లకు చైర్మన్లుగా, మేయర్లుగా చేసి యువజన సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఏ పార్టీకి లేనంత యువసైనికులు బీఆర్‌ఎస్‌కు మాత్రమే ఉన్నారని, ఇప్పటికే 1 లక్షా 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి లక్షలాది మంది ఉద్యోగులను రోడ్డున పడేసిందని విమర్శించారు. దేశమంతా కొత్త విద్యాసంస్థలు ఏర్పాటు చేసినా తెలంగాణకు ఒక్కటి కూడా ఇవ్వలేదని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలను రాకుండా బీజేపీ నాయకులు చేశారని దుయ్యబట్టారు. అయినా జిల్లాకో మెడికల్ కాలేజీ మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. వందల గురుకులాలు ఏర్పాటు చేసి విద్యాహబ్‌గా మార్చుకున్నామని వివరించారు. ఓ వైపు ప్రభుత్వ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూనే మరో వైపు ప్రైవేటు రంగంలో 24 లక్షల ఉద్యోగాలను ప్రభుత్వం కల్పించిందని ఆమె తెలిపారు. యువత మనసు తెలిసిన నాయకుడు కేసీఆర్ అని, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని వివరించారు. అభివృద్ధి ఫలాలు రానున్న కాలంలో యువతకు దక్కుతాయని, సమాజం కోసం పనిచేసే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి యువత ఎల్లప్పుడు అండగా ఉండాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. యువగర్జనకు హాజరైన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి యువ నాయకులు పటోళ్ల కార్తీక్‌రెడ్డిలు మాట్లాడారు. ఒక్క పిలుపుతో సబితమ్మకు మద్దతుగా వేలాది మంది యువత తరలి రావడంతో రానున్న ఎన్నికల్లో సబితమ్మ గెలుపు ఖాయమైందని, యువత అంతా గెలుపులో కీలక పాత్ర పోషించాలని సూచించారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ఇదే జోరు, ఉత్సాహంతో కారు గుర్తుకు ఓట్లు వేసి గెలపించాలని అభ్యర్థించారు. ప్రముఖ గాయకులు ఏపూరి సోమన్న పాటలతో హోరెత్తించారు.



యువగర్జనకు భారీగా తరలివచ్చిన యువకులు

అవకాశమివ్వండి.. అవినీతి రహిత పాలన అందిస్తా..

బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి



మన్సూరాబాద్‌లో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: ఒక్కసారి నాకు అవకాశం ఇవ్వండి అవినీతి రహిత పాలన అందిస్తానని బీజేపీ ఎల్బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మన్సూరాబాద్ పోచమ్మ ఆలయంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి ఆదివారం పూజలు నిర్వహించి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. నాయకులు నాంపల్లి రామేశ్వర్, ఎంజాల జగన్, పాతూరి శ్రీధర్‌గౌడ్, హరీష్‌రెడ్డి, గంగదాసు కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో...

హయత్‌నగర్ డివిజన్ శారదనగర్‌కాలనీలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి సామ రంగారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హయత్‌నగర్‌లో ప్రచారాన్ని ప్రారంభించారు. నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, బండారి భాస్కర్, విజయ్‌కుమార్, కొత్త రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

వాకర్స్‌తో సమావేశం...

చైతన్యపురి: బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి ఆదివారం ఉదయం గడ్డి అన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమమహేశ్వ ర్‌రెడ్డితో కలిసి సరూర్‌నగర్‌లోని ఇందిరా ప్రియదర్శిని పార్క్‌లో వాకర్స్‌తో సమావేశమై ఓటు అభ్యర్థించారు.

ఐదేళ్లు సేవకుడిగా ఉంటా..

బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌రెడ్డి



సుధీర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నందనవనం కాలనీవాసులు

చంపాపేట: తనను ఆశీర్వదించి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఐదేళ్ల పాటు సేవకుడిగా ఉండి, ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన హస్తినాపురం డివిజన్ పరిధిలోని నల్ల పోచమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం జనార్ధన్‌రెడ్డి నగర్, భూపేష్‌గుప్తానగర్, ఆదర్శనగర్, ఆంధ్రసేనారెడ్డి నగర్, దేవీనగర్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు, కాలనీవాసులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై తీన్‌మార్ డప్పులు, డ్యాన్సులు, మంగళహారతులతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ నాయకులు గజ్జల మధుసూదన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పద్మా శ్రీనివాస నాయక్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు సత్యంచారి పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

నాగోలు: కొత్తపేట డివిజన్ ఎల్‌బీనగర్ ఆర్టీసీ కాలనీలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ఎన్నికల కార్యాలయాన్ని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రారంభించారు. కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ జీవీ సాగర్‌రెడ్డి, కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, పాల్గొన్నారు.

అండగా ఉండండి

- మలక్‌పేట అభ్యర్థి అహ్మద్ బలాల



బలాల సన్మానిస్తున్న నాయకులు

మలక్‌పేట: అభివృద్ధి కోసం మజ్లిస్ పార్టీకి అండగా నిలవాలని ఆ పార్టీ మలక్‌పేట అభ్యర్థి అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. యువతనేత బంటారం నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో మలక్‌పేట చర్మాస్ పక్కన ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతానని, ఈ ఎన్నికల్లో తనను మరోసారి ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా జైన్ సమాజ్, అగర్వాల్ సమాజ్, మహేశ్వరి సమాజ్, రాజస్థాన్ సమాజ్ వారు బలాలకు మద్దతు తెలిపారు. నాయకులు యోగేష్‌సింగ్, కౌశల్‌రాజ్‌జైన్, సూగూరు రమేష్, అశోక్ సింఘ్వీ, రాజేష్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీలను అవమానిస్తున్న కాంగ్రెస్'



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్

చంచల్‌గూడ: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు తెలంగాణకు చెందిన బీసీ సీనియర్ నాయకులకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా అవమానిస్తున్నారని రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన కుర్మగూడలో సంఘం సమావేశం నిర్వహించారు. నల్ల కండువాలు వేసుకుని కాంగ్రెస్ పార్టీ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌యాదవ్ మాట్లాడుతూ, పార్టీ అధ్యక్షుడు ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు బీసీలకు ప్రాధాన్యతనివ్వడం లేదని ఆరోపించారు. అగ్రవర్ణ నాయకులను, దొరలను మాత్రమే ఢిల్లీకి పిలిపించుకుంటున్నారన్నారు. జాతీయ స్థాయి నుంచి నగర స్థాయి వరకు పార్టీ పదవుల్లో అగ్రవర్ణల వారినే నియమిస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణమూర్తి, జగదీష్‌గౌడ్ లక్ష్మయ్య, భాస్కర్‌యాదవ్, భిక్షపతి, మల్లేష్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ బహిరంగ సభకు తరలివెళ్లిన విశ్వకర్మలు



దిల్‌సుఖ్‌నగర్ నుంచి సభకు వెళ్లిన విశ్వకర్మలు

చైతన్యపురి: ఉప్పల్ భగాయత్‌లోని విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవన స్థలంలో ఆదివారం జరిగిన విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహాజన బహిరంగ సభకు దిల్‌సుఖ్‌నగర్ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. దిల్‌సుఖ్‌నగర్ స్వర్ణకార వీధి నుంచి భారీ బైక్ ర్యాలీగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రవిచారి, ప్రధాన కార్యదర్శి లవకుమార్, కోశాధికారి రాగిఫణి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు వెంకటాచారి, మాజీ అధ్యక్షుడు కీర్తిగారి అనంతాచారి తదితరులు పాల్గొన్నారు.

కొలసానికి అక్కినేని ఫిలిం ఫేర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న లయన్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు

మన్సూరాబాద్: నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వర్ రావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా నగరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో వీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫిలిం ఫేర్ 2023 అవార్డులను ఆదివారం ప్రదానం చేశారు. ఎల్‌బీనగర్‌కు చెందిన ప్రముఖ సంఘ సేవకుడు లయన్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావుకు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరావు, జాతీయ హ్యూమన్ రైట్స్ చైర్మన్ బాబు ముఖ్యఅతిథులుగా హాజరై నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వర్‌రావు ఫిలింఫేర్ 2023 అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వీఆర్ శ్రీనివాస్, మల్కాజిగిరి కోర్టు న్యాయమూర్తి జస్టిస్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజల బ్రహ్మరథం

- ఎల్బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్



ఎన్నికల ప్రచారంలో దోశలు వేస్తున్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: ఏ కాలనీకి వెళ్లినా ప్రజలు తమకు బ్రహ్మరథం పడుతున్నారని, ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీ సాధించి అధికారంలోకి రావడం ఖాయం అనిపిస్తోందని ఆ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఆదివారం లింగోజిగూడ డివిజన్‌లో గ్రీన్ పార్క్ కాలనీ నుంచి పాదయాత్ర చేపట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, కాంగ్రెస్‌కు పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఎక్కడికి వెళ్లినా మా ఓట్లన్నీ హస్తం గుర్తుకే వేస్తామంటున్నారని, ఎల్‌బీనగర్‌లో తనదే గెలుపని మధుయాష్కీ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి. మిద్దెల జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



ఆర్‌కేపురంలో ప్రచారం చేస్తున్న లక్ష్మారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) అన్నారు. ఆదివారం రామకృష్ణాపురం డివిజన్‌లో వేలాది మందితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతుఊ, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు. త్వరలో జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, నాయకులు బండి మధుసూదన్ రావు, చిలుక ఉపేందర్ రెడ్డి, శివ ప్రసాద్, నల్లంకి ధనరాజు గౌడ్, గట్ల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విజయపురి, ఎస్‌బీఐ కాలనీల్లో...

ఆర్‌కేపురం డివిజన్ విజయపురి, ఎస్‌బీఐ కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ బండి మధుసూదన్‌రావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు గట్ల రవీంద్ర ఆధ్వర్యంలో లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆదివారం గడప గడపకూ ప్రచారం నిర్వహించారు.

బీజేపీతోనే పాతబస్తీ అభివృద్ధి సాధ్యం

- మలక్‌పేట అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి



సైదాబాద్‌లో పాదయాత్రతో ప్రచారం చేస్తున్న సురేందర్‌రెడ్డి

సైదాబాద్: బీజేపీ గెలుపుతోనే పాతబస్తీలో అభివృద్ధి సాధ్యమవుతుందని మలక్‌పేట బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సైదాబాద్ డివిజన్‌లోని పలు కాలనీల్లో పాదయాత్ర చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి తనను గెలిపించాలని కోరారు. అనంతరం సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, స్థానికేతరుడైన ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజాసమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ పథకాలను సైతం అసలైన లబ్ధిదారులకు అందకుండా తన సొంత మనుషులకు ఇప్పించారని ఆరోపించారు. ప్రధాని మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వ పథకాలతో అన్నివర్గాల వారు అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. మలక్‌పేట వాసులు ఈసారి నియోజకవర్గంలో బీజేపీని గెలిపించటం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్‌తోనే మరింత అభివృద్ధి

- మలక్‌పేట అభ్యర్థి అజిత్‌రెడ్డి



వృద్ధుడికి బీఆర్‌ఎస్ ఎన్నికల గుర్తు చూపిస్తున్న తీగల అజిత్‌రెడ్డి

మలక్‌పేట: నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి ఆదివారం మూసారంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచిపెడుతూ కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్‌తోనే మరింత అభివృద్ధి సాధ్యమన్నారు. ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించడానికి శాయశక్తులా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ప్రచారంలో మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డి, రాధా, మహేష్, కుమార్, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

తనిఖీలలో రూ. 3 లక్షలు స్వాధీనం

నాగోలు: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు ఆదివారం ఎలాంటి పత్రాలు లేకుండా ఓ వ్యక్తి తరలిస్తున్న రూ. 3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ పోలీసుల కథనం ప్రకారం... ఆదివారం సాయంత్రం చింతలకుంట చౌరస్తాలో ఎల్‌బీనగర్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో రవికుమార్ అనే వ్యక్తి కారులో రూ. 3 లక్షలు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులు ఆ మొత్తంతో పాటు సదరు వ్యక్తిని ఎల్‌బీనగర్ అసెంబ్లీ ఎన్నికల అధికారి ముందు హాజరుపర్చారు.

బస్తీ పెద్దలతో బీజేపీ అభ్యర్థి ములాఖత్

చంచల్‌గూడ: హిందువులంతా ఒకే తాటిపైకి వచ్చి బీజేపీకి ఓటు వేస్తే పాతబస్తీలో జెండా ఎగురవేయడం ఖాయమని యాకుత్‌పురా బీజేపీ అభ్యర్థి ఎన్.వీరేందర్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన కుర్మగూడ డివిజన్‌లోని ముఖ్య నాయకులు, బస్తీ పెద్దలు, యాదవ్ సంఘం ప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిశారు. తన అభ్యర్థిత్వాన్ని ఓటు ద్వారా బలపరిచి పాతబస్తీలో కొత్త చరిత్ర సృష్టించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వీరేందర్‌యాదవ్ కోరారు. భారత దేశం ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చెందుతుంటే, పాతబస్తీ మాత్రం అభివృద్ధికి దూరంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

బీజేపీకి అధికారం ఖాయం

- మహేశ్వరం అభ్యర్థి శ్రీరాములు యాదవ్



చిత్రలేవుట్ కాలనీలో ప్రచారం చేస్తున్న శ్రీరాములు యాదవ్ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలో ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ ప్రచారం నిర్వహించారు. అందెలకు మద్దతుగా బీజేపీ జాతీయ నాయకుడు పేరాల శేఖర్ జీ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమ కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టి పకడ్బందీగా అమలు చేస్తోందని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి జరగలంటే బీజేపీతో సాధ్యమవుతుందన్నారు.ఈ సందర్భంగా చిత్ర లేవుట్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధీరజ్ రెడ్డి, పిట్ట ఉపేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ముంతా రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ మేళాకు విశేష స్పందన



మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురం హుడా ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు కాలనీల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో దీపావళి పండుగ సందర్భంగా మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్‌లు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, చెప్పులు, బ్యాగులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని ఆయన అన్నారు.

అనారోగ్య సమస్యలకు ఆయుర్వేదం చక్కటి పరిష్కారం



ఆయుర్వేద అవగాహన ర్యాలీని ప్రారంభించిన జీపీ ప్రసాద్

సైదాబాద్: ఎలాంటి అనారోగ్య సమస్యకు అయినా ఆయుర్వేద వైద్య విధానం చక్కటి పరిష్కారం చూపుతుందని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జీపీ ప్రసాద్ అన్నారు. ఆదివారం సైదాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో 8వ ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం సంస్థ కార్యాలయం నుంచి ఎల్‌బీనగర్ వరకు.. అక్కడి నుంచి తిరిగి సంస్థ వరకు ఆయుర్వేద ఫర్ వన్ హెల్త్ నినాదంతో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీపీ ప్రసాద్ మాట్లాడుతూ, ఆయుర్వేద ప్రచారం, అవగాహన కోసం దేశంలో 11 నగరాల్లో ర్యాలీలు నిర్వహించామన్నారు. ర్యాలీలో పాల్గొన్న వారికి ఆయన సంస్థ తరపున సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజెన్లకు ఆయన చ్యవనప్రాశ లేహ్యాన్ని పంపిణీ చేశారు.

దివ్యాంగ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలి

చాదర్‌ఘాట్: ఎన్నికల విధుల నుంచి దివ్యాంగ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ దివ్యాంగుల ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ హబీబ్ మియా, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య ఎన్నికల సంఘాన్ని కోరారు. ఆదివారం మలక్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ వినతికి తెలంగాణ ఎన్నికల కమిషనర్ సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్‌లకు తగు విధంగా ఉత్తర్వులు జారీ చేశారన్నారు.ఇందుకు ఎన్నికల కమిషనర్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్లు ఎన్నికల కమిషన్ ఆదేశాలను అమలు చేయాలని వారు కోరారు.

రాంమోహన్ గౌడ్‌ను కలిసిన సుధీర్‌రెడ్డి



అలింగనం చేసుకున్న సుధీర్‌రెడ్డి,రాంమోహన్‌గౌడ్

ఎల్‌బీనగర్: ఎల్బీనగర్ బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఇన్‌చార్జ్ ముద్దగౌని రాంమోహన్‌గౌడ్‌తో తనకు ఉన్న వైషమ్యాలకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్వస్తి పలికారు. సుధీర్‌రెడ్డి ఆదివారం రాంమోహన్‌గౌడ్ నివాసానికి వెళ్లి కలిశారు. ఆలింగనం చేసుకున్న ఇద్దరు నేతలు తమ మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు లేవని ప్రకటించారు. సుధీర్‌రెడ్డి విజయానికి తన వంతు కృషి చేస్తానని రాంమోహన్‌గౌడ్ తెలిపారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, రాంమోహన్‌గౌడ్ చేరికతో బీఆర్‌ఎస్‌కు బలం చేకూరిందని అన్నారు. భవిష్యత్‌లో నియోజకవర్గాల విభజన జరుగుతుందని, అప్పుడు రాంమోహన్‌గౌడ్ కుటుంబానికి న్యాయం జరుగుతోందని అన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 23, వంకాయ 15, బెండ 28, పచ్చిమిర్చి 35, కాకర 23, బీర 23, క్యాబేజీ 11, ఫ్రెంచిబీన్స్ 55, క్యారెట్ 37, దొండ 13, చిక్కుడు 40–65, గోకర 23, బీట్‌రూట్ 28, క్యాప్సికం 37, ఆలు 21, దోస 13, సొర 9, పొట్ల 15, ఉల్లిగడ్డ 44, చామగడ్డ 35.